క్లుప్తంగా

ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి



చిల్పూరు: బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం అర్చకులు రవీందర్ శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ పంచామృత చందనహరిద్రకుంకుమాది లేపనాలతో పాటు ఫలతులసీ అలంకరణలో స్వామివారిని అలంకరించారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీప్రసన్న, జూనియర్ అసిస్టెంట్ కుర్రెంల మోహన్, వీరన్న ఉన్నారు.

సాయంలో ముందుండాలి



బచ్చన్నపేట: నిరుపేదలకు తోచినంతగా సాయం అందించడంలో ప్రతి ఒక్కరూ ముందుండాలని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో స్ట్రీట్‌కాజ్ గ్రీట్ స్వచ్ఛంద సేవా సంస్థ హైదరాబాద్ వారి సహకారంతో మండల కేంద్రానికి చెందిన మృతురాలు జిల్లెల్ల అరుణ జ్ఞాపకార్థం ఆమె భర్త సిద్దారెడ్డి పలు వస్తువులను బహూకరించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో బెడ్లు, పరుపులు, ఫ్రిజ్, అలాగే ఇందిరానగర్ పాఠశాలకు జిరాక్స్, ప్రింటర్ మిషన్లు, వాటర్ ప్యూరిఫయర్, జీపీకి స్ట్రీట్ లైట్లు తదితర మొత్తం రూ. 8 లక్షల విలువైన వస్తువులను అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రతాప్‌రెడ్డి హాజరై వాటిని అందజేసిన అనంతరం మాట్లాడారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు బనుక శివరాజ్‌యాదవ్, నల్లనాగుల శ్వేత, వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి, నాయకులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

రఘునాథపల్లి: మండలంలోని ఫతేషాపూర్, రఘునాథపల్లిలో మృతి చెందిన బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే కడియం శ్రీహరి శుక్రవారం పరామర్శించారు. ఫతేషాపూర్‌లో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు యామంకి శ్రీనివాస్ అనారోగ్యంతో మరణించగా ఎమ్మెల్యే పార్టీ నాయకులతో కలిసి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదే విధంగా రఘునాథపల్లిలో మృతి చెందిన గాదె భాస్కర్‌రెడ్డి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. మృతుడి చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గంగిడి నర్సింహారెడ్డి, లింగాజీ, రవిగౌడ్, రమేశ్ ఉన్నారు.

వెంకిర్యాలలో..

జనగామ రూరల్: మండలంలోని వెంకిర్యాల గ్రామ మాజీ సర్పంచ్ నాంపల్లి రాములు మృతి చెందాడు. కాగా, విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి శుక్రవారం గ్రామానికి చేరుకుని మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.

‘అదానీ’ని అరెస్టు చేయాలి

జనగామ రూరల్: ప్రపంచ దేశాల్లో భారతదేశ ప్రతిష్టను దిగజార్చిన గౌతమ్ అదానీని అరెస్టు చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని గబ్బెట గోపాల్‌రెడ్డి భవన్‌లో రావుల సదానందం అధ్యక్షతన నిర్వహించిన జిల్లా సమితి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అమెరికాలో ప్రధాని మోదీ సన్నిహితుడు అదానీపై క్రిమినల్ కేసు నమోదు చేయడంతో దేశ ప్రతిష్టకు భంగం వాటిల్లిందన్నారు. ఆదానీని అరెస్టు చేసి తన నిజాయితీని మోదీ నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి సీహెచ్. రాజారెడ్డి, సుగుణమ్మ, సాయన్న, శ్రీనివాస్, సోమయ్య, కావటి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు

జనగామ రూరల్: విద్యార్థులు చదువుతోపాటు సమాజాన్ని చదవాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేశ్ అన్నారు. జిల్లా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని కళాశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడారు. విద్యను వ్యాపారం చేస్తూ, ప్రభుత్వ విద్యను, విశ్వవిద్యాలయాలను పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో యూనిస్, రాము, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

బచ్చన్నపేట: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా తమ పేరును నమోదు చేసుకోవాలని తహసీల్దార్ ఎస్.టి. ప్రకాశ్‌రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్‌లో ఆయన మాట్లాడారు. 2025 జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండే వారు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం–2025 నిర్వహిస్తున్నామని, ఈ నెల 23, 24 తేదీల్లో పోలింగ్ కేంద్రాల వద్ద బూత్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు.

శిథిలావస్థలో వాటర్ ట్యాంకు

- ఆందోళనలో స్థానికులు
- కొత్త ట్యాంకు నిర్మించాలని వేడుకోలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

జఫర్‌గఢ్: మండల కేంద్ర శివారు మాల్యగుట్టపై నిర్మించిన ఓహెచ్ఆర్ వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరుకుంది. ప్రమాదపుటంచున ఉన్న ట్యాంకు ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. జఫర్‌గఢ్ గ్రామంతో పాటు ఇదే గ్రామ శివారు వడ్డెగూడెం వాసులకు తాగునీరు అందించేందుకు ఎత్తైన మాల్యగుట్టపై ట్యాంక్‌ను నిర్మించారు. ట్యాంకుకు కొద్ది దూరంలో గుట్ట దిగువన పెద్ద చెరువు కింద పెద్ద బావిని నిర్మించారు. బావి నుంచి మాల్యాగుట్టపై ఉన్న వాటర్ ట్యాంకుకు నీటిని తరలించేందుకు మోటర్‌తో పాటు పైపు లైన్ వేశారు. వీటి ద్వారా ట్యాంక్‌లోకి సరఫరా చేసి గ్రామానికి పైపులైన్ల నుంచి నల్లాల ద్వారా నీటిని అందిస్తున్నారు. కాగా, ప్రస్తుతం వాటర్ ట్యాంకు శిథిలావస్థకు చేరుకుంది. ట్యాంక్ కూలిపోక ముందే ఇదే చోట కొత్తది నిర్మించాలని గ్రామ పంచాయతీ పాలకులతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి గ్రామస్తులు పలుమార్లు తీసుకెళ్లినా ఫలితం లేదని వాపోతున్నారు. ఇదే విషయాన్ని ఇటీవల గ్రామాభివృద్ధిపై సమావేశాన్ని నిర్వహించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి కూడా గ్రామస్తులు తీసుకెళ్లారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి కొత్తగా వాటర్ ట్యాంక్‌ను నిర్మించడంతో పాటు శిథిలావస్థలో ఉన్న ట్యాంక్‌ను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



శిథిలావస్థలో ఉన్న వాటర్ ట్యాంకు

ట్యాంకు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం..

మాల్యగుట్టపై నిర్మించిన వాటర్ ట్యాంకు శిథిలావస్థకు చేరుకుందని తెలిసిన వెంటనే ఆరుమాసాల క్రితం కొత్తగా రెండు వాటర్ ట్యాంకుల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ఇందులో ఒకటి లక్ష 20 వేల లీటర్ల కేపాసిటీ, మరొకటి 60 వేల లీటర్ల కేపాసిటీ వాటర్ ట్యాంక్ నిర్మాణం కోసం ప్రభుత్వానికి నివేదించడం జరిగింది. వీటికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు వచ్చిన వెంటనే నిర్మాణ పనులు చేపడతాం.

– సుకన్య, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్

కొత్త వాటర్ ట్యాంక్‌ను నిర్మించాలి



ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన వాటర్ ట్యాంకు కూలేందుకు సిద్ధంగా ఉంది. ప్రస్తుతం ఈ వాటర్ ట్యాంకు ద్వారా జఫర్‌గఢ్, వడ్డెగూడెం గ్రామాలకు తాగునీరు అందుతోంది. శిథిలావస్థలో ఉన్న ట్యాంకుపై ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా కొత్త ట్యాంకు నిర్మించడంతో పాటు శిథిలావస్థలో ఉన్న వాటర్ ట్యాంక్‌ను తొలగించాలి.

– తోట రమేశ్, వడ్డెగూడెం వాసి

నాణ్యమైన ఆహారం అందించండి

- అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్



మోడల్ స్కూల్ తనిఖీలో పింకేష్ కుమార్

నర్మెట: విద్యార్థినులకు పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహారం అందించాలని అడిషనల్ కలెక్టర్ (ఎల్‌బీ) పింకేష్ కుమార్ అన్నారు. మండలకేంద్రంలోని మోడల్ స్కూల్‌ను శుక్రవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీ చేసిన ఆయన అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధిలో భాగంగా వంటశాల, విద్యుత్ మరమ్మతులు, ఫ్యాన్లు, లైట్లు, తలుపులు, టైల్స్ తదితరాల ఏర్పాటును పరిశీలించిన అనంతరం బాలికల హాస్టల్ గదులను, వంటశాలను, భోజన పదార్థాలను, రికార్డులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. మౌలిక వసతులపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణలో చీకటిగా ఉందని విద్యుత్ దీపాల కావాలని విద్యార్థినులు తెలుపడంతో చీకటిని గమనించిన ఆయన తక్షణం ఏర్పాటు చేయించాలని అధికారులకు సూచించారు. తహసీల్దార్ రామానుజాచార్యులు, ఎంపీడీఓ బి. అరవింద్ చౌదరి, ఎంఈఓ ఐలయ్య, ప్రిన్సిపాల్ పుష్పకుమారి, సంరక్షకురాలు సునీత ఉన్నారు.

కార్తీకమాస పూజలు



అమ్మవారికి పూజ చేస్తున్న అర్చకుడు

జనగామ: జిల్లా కేంద్రం హెడ్ పోస్ట్ ఆఫీస్ ఏరియాలోని సంతోషిమాత ఆలయంలో శుక్రవారం కార్తీక మాస ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి శ్రీనివాసశర్మ మంత్రోచ్ఛరణల నడుమ జరిగిన పూజా కార్యక్రమాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం లలిత, విష్ణు సహస్రనామం పఠించారు.

నేత్ర వైద్యశిబిరం

సంతోషిమాత ఆలయంలో హనుమకొండకు చెందిన ఓ ప్రైవేట్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించగా, పూజారి శ్రీనివాసశర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. ఆలయానికి వచ్చిన ప్రతి భక్తుడికి కంటి పరీక్షలు చేశారు.

ప్రతీ రోజు సీసీ కెమెరాలను మానిటరింగ్ చేయాలి



ఏపీజీవీబీలో సీసీ కెమెరాలు, అలారం పనితీరును పరిశీలిస్తున్న ఏసీపీ పార్థసారథి

- ఏసీపీ పార్థసారథి

తరిగొప్పుల: బ్యాంకులోని సీసీ కెమెరాలు, అలారం సిస్టం పనిచేస్తున్నాయా లేదా అని ప్రతీ రోజు మానిటరింగ్ చేయాలని, సెక్యూరిటీ గార్డ్‌ను ఏర్పాటు చేసుకోవాలని ఏసీపీ పార్థసారథి అన్నారు. మండలకేంద్రంలోని ఏపీజీవీబీని ఆయన శుక్రవారం సందర్శించారు. బ్యాంకులోని లాకర్ సేఫ్టీ, సెక్యూరిటీ, సీసీ కెమెరాల పనితీరును బ్యాంకు మేనేజర్ సత్యనారాయణను అడిగి తెలుసుకున్నారు. బ్యాంకులో సీసీ కెమెరాల డీవీఆర్ కెపాసిటీని పెంచుకోవాలని, దొంగలు తెలివిగా డీవీఆర్‌ను ఎత్తుకెళ్తున్నారని, వైఫైతో నడిచే సీసీ కెమెరాలను సేఫ్టీ లాకర్, బ్యాంకు ఎదుట ఏర్పాటు చేయాలని సూచించారు.ప్రజలు దాచిపెట్టుకున్న డబ్బు, బంగారం కాపాడడానికి సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. ఏఎస్సై కాసర్ల రాజయ్య, హెడ్ కానిస్టేబుల్ బాలోజీ ఉన్నారు.

తెలంగాణ ఉద్యమంలో ముఖ్యభూమిక పోషించిన ‘పాగాల’

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చిల్పూరు: ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దివంగత జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి ముఖ్యభూమిక పోషించారని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని రాజవరం గ్రామానికి చెందిన తొలి జెడ్పీ చైర్మన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు పాగాల సంపత్‌రెడ్డి ప్రథమ వర్ధంతిని జిల్లా నాయకుడు జనగామ యాదగిరి అధ్యక్షతన నిర్వహించారు. మొదట గ్రామ బస్‌స్టేజీ సమీపంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఎదుట ఏర్పాటు చేసిన పాగాల విగ్రహాన్ని సంపత్‌రెడ్డి భార్య సుజాత, కూతురు సంజనారెడ్డితో కలిసి ఎమ్మెల్యే పల్లా, మాజీ ఎమ్మెల్యే రాజయ్య, ఎడవెల్లి కృష్ణారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. డాక్టర్ సుగుణాకర్‌రాజు, చేవెళ్ల సంపత్, సుదర్శన్, లింగారెడ్డి, దామోదర్, అల్లం ప్రదీప్‌రెడ్డి, చింతకింది కష్ణమూర్తి, రంగురవి, యాకూబ్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పాగాల సంపత్‌రెడ్డి విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే పల్లా, మాజీ ఎమ్మెల్యే రాజయ్య తదితరులు

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం, పీడీ

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ శివారు ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు బి.కిరణ్, ఈ.బన్నీ, పి.ఉదయ్‌చరణ్, బి.నిఖిల్ రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ఐ క్రీడాపోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కృతమూర్తి, పీడీ జి.శ్రీనివాస్ తెలిపారు. పాఠశాలలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ వివరాలు తెలిపారు. ఇటీవల జరిగిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ఐ అండర్–19 విభాగంలో ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొన్న బి.కిరణ్, ఈ.బన్నీ (ఎంపీసీ, ద్వితీయ సంవత్సరం), పి.ఉదయ్‌చరణ్ (బైపీసీ ద్వితీయ సంవత్సరం) ఉత్తమ ప్రతిభతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 25 నుంచి 27వరకు మహబూబ్‌నగర్ జడ్చర్లలో జరిగే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. అదేవిధంగా అండర్ 14 విభాగంలో ఖోఖో పోటీలలో పాల్గొన్న బి.నిఖిల్ (9వ తరగతి) ఉత్తమ ప్రతిభతో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడని, ఈనెల 23 నుంచి 25 వరకు హైదరాబాద్ దోమలగూడలో జరిగే పోటీలలో పాల్గొంటారని తెలిపారు. కాగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ప్రిన్సిపాల్ , పీడీ , పీఈటీ లక్ష్మణ్, కోచ్ ప్రవీణ్, వైస్ ప్రిన్సిపాల్ రవీందర్‌తెసాటే తదితరులు అభినందించారు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు శివునిపల్లి జెడ్పీఎస్ఎస్ విద్యార్థులు

శివునిపల్లి జెడ్పీఎస్ఎస్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల హెచ్ఎం కుసుమ రమేష్, పీడీ కొండ రవి తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన బానోత్ ప్రకాష్, జింక రాంచరణ్ (9వ తరగతి), గండికోట రాంచరణ్, సుంకరి రుత్విక్(8వ తరగతి), గుర్రం నాని(ఏడవ తరగతి)లను హెచ్ఎం, పీడీతో పాటు ఉపాధ్యాయులు పాఠశాలలో శుక్రవారం అభినందించారు. కాగా, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను క్రీడా ప్రోత్సాహకులు ఎండీ.దస్తగిరి, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ భగత్, జొన్నల రాజేశ్వర రావు తదితరులు అభినందించారు.



పాలకుర్తి: దుర్గాప్రసాద్‌ను అభినందిస్తున్న హెచ్ఎం, కరస్పాండెంట్

రాష్ట్రస్థాయి పోటీలకు ‘మహర్షి’ విద్యార్థి

పాలకుర్తి: చెన్నూరు గ్రామం మహర్షి విద్యామందిర్ విద్యార్థి రావుల దుర్గాప్రసాద్ అండర్–14 రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం వెంకటాచారి, కరస్పాండెంట్ నరేందర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ నెల 23, 24 తేదీల్లో మెదక్ జిల్లా మాసాయిపేటలో జరిగే పోటీల్లో దుర్గాప్రసాద్ పాల్గొనున్నట్లు హెచ్ఎం చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థిని హెచ్ఎం, కరస్పాండెంట్ అభినందించారు.

‘కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీనే’

నర్మెట: కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీ మాత్రమేనని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సౌడ రమేశ్ అన్నారు. మండలకేంద్రంలో మండలశాఖ అధ్యక్షుడు రంగు మురళి అధ్యక్షతన శుక్రవారం ఏర్పాటు చేసిన క్రియాశీల సభ్యుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని, ప్రజల అవసరాలను గుర్తించి ప్రతీ కార్యకర్త సమస్యలపై నిరంతర పోరాటం చేసి బీజేపీని మరింత బలోపేతం చేయాలని అన్నారు. జిల్లా ప్రచార కార్యదర్శి పెద్దోజు జగదీష్, సాక్కం అనిల్ కుమార్, బుచ్చాల కొంరెల్లి, బైరగోని అంజనేయులు, అవినాష్, బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

‘రాబోయే రోజుల్లో బీజేపీదే అధికారం’

తరిగొప్పుల: భారతీయ జనతా పార్టీ ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వం కలిగి ఉందని, రాబోయే రోజుల్లో తెలంగాణలో అధికారం చేపడుతుందని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సౌడ రమేశ్ అన్నారు. మండల అధ్యక్షుడు అవుల శ్రీనివాస్ అధ్యక్షతన మండల స్థాయి సమావేశం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లా బాధ్యులు పెద్దోజు జగదీష్, బైరగోని అంజనేయులు, రాంబ్రహ్మాచారి, కొన్నె రాజు, రమేశ్ పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన



జనగామ: హోమం చేస్తున్న వీవర్స్ కాలనీవాసులు



జఫర్‌గఢ్: ఊరేగింపులో విగ్రహ దాతతో రాజయ్య



జఫర్‌గఢ్: పూజ చేస్తున్న అర్చకులు

జనగామ: పట్టణ పరిధి వీవర్స్‌కాలనీలో ఈనెల 18 ప్రారంభమైన ఎల్లమ్మ, పోచమ్మతల్లి దేవతా మూర్తుల విగ్రహాల ప్రతిష్ఠాపన వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ నెల18న ప్రారంభమైన వేడుకలకు పెద్ద ఎత్తున భక్తజనం, కుటుంబ సభ్యులు, బంధువులు తరలి వచ్చారు. దేవాలయ కమిటీ అధ్యక్షుడు ఎనగందుల వెంకటేశ్వర్లు, కార్యదర్శి బొంతపల్లి వెంకటేశ్వర్లు, కోశాధికారి కామిని సమ్మయ్య ఆధ్వర్యంలో సుదనందగిరి స్వామిజీ, సిద్దులగుట్ట ప్రశాంత నిలయం శివానంద, నిత్య శుద్ధానంద స్వామిజీ ఆశీస్సులతో పురోహితులు వినోద్ శర్మ మంత్రోచ్ఛరణల నడుమ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. రోజువారీగా భగవత్, గీతాపారాయణాలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు, హోమాలు, భజనలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలను చేపట్టారు. లింగాలఘన పురం మండలం మాణిక్యపురం ఒగ్గుకళాకారులు బుగ్గ శ్రీనివాస్, ఎల్లయ్య ఆధ్వర్యంలో ఒగ్గుకథ వినిపించారు. శుక్రవారం అమ్మవార్ల కల్యాణ మహోత్సవం నిర్వహించారు. విగ్రహ దాతలను ఘనంగా సత్కరించారు.



జనగామ: అమ్మవారికి పూజ చేస్తున్న భక్తులు

లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు

జఫర్‌గఢ్: మండల కేంద్రంలో వేల్పుగొండ దిగువన ఉన్న లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య మొదటి రోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ అర్చకుడు వెంకటాచార్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు శ్రీనివాసచార్యులు, కృష్ణమచార్యుల, భక్తులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి విగ్రహ ఊరేగింపు

మండల కేంద్రంలోని వేల్పుగొండ లక్ష్మీనర్సింహస్వామి కొండ దిగువన రామాలయం పక్కన దాత లకావత్ రవీంద్రనాయక్–సుభద్ర దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న అభయాంజనేయ స్వామి విగ్రహ ఊరేగింపు కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కాగా, మూడు రోజుల పాటు ప్రత్యే పూజా కార్యక్రమాల అనంతరం గద్దెపై విగ్రహ ప్రతిష్ఠాపన చేయనున్నట్లు విగ్రహ దాత రవీంద్రనాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్యతో పాటు నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

‘హైకోర్టు తీర్పు బీఆర్ఎస్ నాయకులకు గుణపాఠం’

స్టేషన్‌ఘన్‌పూర్: పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై హైకోర్టు తీర్పు బీఆర్ఎస్ నాయకులకు చెంపపెట్టులాంటిదని, బీఆర్ఎస్ నాయకులకు తగిన గుణపాఠం జరిగిందని కాంగ్రెస్ పార్టీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొలిపాక సతీష్ అన్నారు. ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్ పార్టీ, ఇతర పార్టీల నుంచి గెలిచిన ఎమ్మెల్యేలను బీఆర్ఎస్ పార్టీలో చేర్చుకున్నారని, ప్రస్తుతం బీఆర్ఎస్‌లో గెలిచి కాంగ్రెస్ ప్రభుత్వంలోకి వచ్చిన ఎమ్మెల్యేలను బర్తరఫ్ చేయాలని మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి హయంలో ఎన్నికల ముందు చేసిన హామీలకు అనుగుణంగా ప్రజాపాలన సాగుతుందని, అన్ని వర్గాలకు అభివృద్ధి ఫలాలు అందుతున్నాయన్నారు. ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి నియోజవకర్గ అభివృద్ధే లక్ష్యంగా ప్రత్యేక చొరవతో పనిచేస్తున్నారని, ప్రజలకు చేసి హామీలను నెరవేర్చేదిశగా తనదైన శైలిలో కృషి చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా నియోజవకర్గ బీఆర్ఎస్ నాయకులు అభివృద్ధికి సహకరించాలన్నారు.

‘గాలికుంటు’ నివారణ టీకాలు వేయించాలి



స్టేషన్‌ఘన్‌పూర్: శిబిరాన్ని ప్రారంభిస్తున్న రాధాకిషన్



చిల్పూరు: పశువుకు చికిత్స అందిస్తున్న అనేశ్

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రస్తుత సీజన్‌లో రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ వై.రాధాకిషన్ అన్నారు. సముద్రాల గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం, గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉచిత పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరంలో 56 పశువులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఇప్పగూడెం, ఉప్పుగల్లు పశువైద్యాధికారులు డాక్టర్ మౌనిక, డాక్టర్ శ్రీనాథ్, జేవీఓ వెంకటేశ్వర్లు, గోపాలమిత్ర సూపర్‌వైజర్ రాజేశ్వర్‌రావు, గోపాలమిత్రులు బిక్షపతి, రాజు, అయాస్, రాజేష్, పశుమిత్రులు స్వప్న, మనీల, శ్యామల పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలి

చిల్పూరు: జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో నిర్వహించే వైద్య శిబిరాలను పాడిరైతులు వినియోగించుకోవాలని వైద్యాధికారి మూడికె అనేశ్ అన్నారు. మండలంలోని వెంకటేశ్వరపల్లిలో గురువారం ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మూడికె అనేశ్ మాట్లాడారు. లింగనిర్ధారణ వీర్యంతో కృత్రిమ గర్భధారణ చేయిస్తే ఆడదూడలు పుడతాయన్నారు. వీఎల్ఓ సుధాకర్, ఫయాజ్, రమేష్, గోపాలమిత్ర రాజేశ్వర్‌రావు, ఆయాస్ పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్‌కు మరమ్మతు

లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్లలో జనగామ–సూర్యాపేట రోడ్డులో నెల్లుట్ల గ్రామంలో ఉన్న సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ మరమత్తులకు గురికావడంతో సమస్యలను ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లగా శుక్రవారం నేషనల్ హైవే అధికారులు పనులు మొదలు పెట్టినట్లు కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు బత్తిని అశోక్ తెలిపారు. గత కొంతకాలంలో నెల్లుట్ల వద్ద హైవేలోని లైట్లు వెలుగకపోవడంతో మాజీ జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారంతో ఎన్‌హెచ్ డిప్యూటీ ఈఈ రాజారాం, ఏఈ స్వప్నతో మాట్లాడి పనులు ప్రారంచారని, వారం పది రోజుల్లో పూర్తవుతాయని వివరించారు.

డిసెంబర్ 27 నుంచి మహాసభలు

జనగామ రూరల్: డిసెంబర్ 27, 28 తేదీల్లో సీపీఎం జిల్లా మూడో మహాసభలు స్టేషన్‌ఘన్‌పూర్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి మోకు కనుక రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ మేరకు జిల్లా పార్టీ కార్యాలయంలో మహాసభల ఆహ్వాన కమిటీ ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. ఆహ్వాన సంఘం అధ్యక్షుడిగా రాపర్తిరాజు ప్రధాన కార్యదర్శిగా కనుకరెడ్డి, కోశాధికారిగా మునిగల రమేశ్‌తోపాటు 300 మందిని ఏర్పాటు చేశామన్నారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

పాలకుర్తిటౌన్: పేకాట స్థావరాలపై పోలీసులు దాడి చేసిన ఘటన శుక్రవారం మండల పరిధిలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై దూలం పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బమ్మెర గ్రామ శివారులో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఐదు సెల్ ఫోన్లు, రూ.2,270 స్వాధీనం చేసుకున్నారు.

సంక్షిప్త సమాచారం

తప్పిన ప్రమాదం

జనగామ రూరల్: జనగామ–హుస్నాబాద్ రోడ్డు గానుగుపహాడ్ వాగు వద్ద నిర్మాణం నిలిచి పోయిన బ్రిడ్జిలోకి హుస్నాబాద్ నుంచి లోడ్‌తో జనగామకు వెళ్తున్న లారీ అదుపు తప్పి దూసుకొచ్చిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. అయితే లారీ డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో వాగులో లారీ పడకుండా ఆగింది. దీంతో లారీ డ్రైవర్‌కు ప్రమాదం తప్పినట్లయింది. బ్రిడ్జి నిర్మాణం పూర్తికాక తాత్కాలిక రోడ్డుపై ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని కోరుతున్నారు.

కారు ఢీకొని వాహనదారుడి మృతి

బచ్చన్నపేట: ఎదురెదురుగా వస్తున్న కారు–స్కూటీ జనగామ జిల్లా శామీర్ పేట వద్ద ఢీనడంతో ద్విచక్ర వాహనంపై ఉన్న వ్యక్తికి తీవ్ర గాయాలవగా చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన శుక్రవారం జరిగింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పోచన్నపేటకు చెందిన ఇంజ చంద్రయ్య (52) భవన నిర్మాణరంగ కార్మికుడు. గురువారం జనగామలో బంధువుల వివాహానికి హాజరైన చంద్రయ్య స్కూటీపై ఇంటికి వస్తుండగా జనగామ పట్టణానికి చెందిన ఏనుగుల వీరయ్య కారును అతి వేగంతో నడుపుతూ ఎదురుగా వచ్చి శామీర్‌పేట వద్ద ఢీకొనగా చంద్రయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షేమ పథకాలపై కళాజాతా

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో శుక్రవారం కళాజాతా నిర్వహించారు. ప్రజాపాలన విజయోత్సవ కళాయాత్రలో భాగంగా మండలంలోని ఆలింపూర్, కట్కూర్ గ్రామాల్లో కళాజాతా చేపట్టారు. కళాకారులు రత్నం, సంజీవ, కనకరాజు, గణేష్, శ్రీనివాస్, స్వప్న, పద్మ, రంజాన్, చామంతి, మమత పాల్గొన్నారు.

పత్తి మిల్లులో అగ్ని ప్రమాదం



లింగాలఘణపురం: నెల్లుట్ల సమీప ఓం శాంతి పత్తి మిల్లులో శుక్రవారం రాత్రి అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న జనగామ అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పారు. రాత్రి వేళ కావడంతో ప్రమాదానికి కారణాలు, పత్తికి ఎంతమేర నష్టం వాటిల్లిందనే విషయం తెలియాల్సి ఉంది. కాగా మిల్లులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం కూడా ఉంది. సీసీఐ కొనుగోలు చేసిన పత్తి కాలిపోయిందా లేక మిల్లు యాజమాన్యానికి చెందిన పత్తి కాలిందా అనే వివరాలు తెలియరాలేదు.